క్లుప్తంగా

నేడు ఓట్ల చోరీపై సంతకాల సేకరణ

మహేశ్వరం: ఎన్నికల్లో నెగ్గడానికి బీజేపీ దేశ వ్యాప్తంగా ఓట్ల చోరీకి పాల్పడిందని, దానికి వ్యతిరేకంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్‌ముదిరాజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నిరసన కార్యక్రమం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నామని, మండలంలోని పార్టీ నాయకులు, గ్రామ శాఖ, వివిధ అనుబంధ శాఖల అధ్యక్షులతో పాటు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కేఎల్లార్‌ను కలిసిన నాయకులు


కేఎల్లాఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కందుకూరు: మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డిలను కందుకూరు పీఏసీఎస్ చైర్మన్ వెంకటరామ్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఆదివారం తుక్కుగూడలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ సబావత్ కృష్ణ నాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్కజంగారెడ్డి, రాంచంద్రారెడ్డి, చిర్రె సాయిలు, రాణా ప్రతాప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మదన్‌పాల్‌రెడ్డి, రాకేష్, విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

వృద్ధురాలి అదృశ్యం


లక్ష్మమ్మ (ఫైల్)

చంచల్‌గూడ: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన మాదన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదన్నపేటలో నివసించే లక్ష్మమ్మ (70) గత శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రైనా రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారితో ఆరా తీయగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సంతకాల సేకరణను విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: దేశంలో ఓట్ల చోరీపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గంలో ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ తెలిపారు. ఆదివారం పుర కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ సంతకాల సేకరణ నియోజకవర్గంలో ఆకులమైలారం నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో సంతకాలు చేపట్టి ఈసీ తప్పిదాన్ని ఎండగట్టాలని హస్తం పార్టీ యోచిస్తోందన్నారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

పెద్దచెరువు అభివృద్ధిపై నిర్లక్ష్యం తగదు

మన్సూరాబాద్: పెద్దచెరువు అభివృద్ధిని సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచడం శోచనీయమని అధికారులు తమ నిర్లక్ష్యాన్ని వీడాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. పెద్దచెరువు పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించి మాట్లాడారు. జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, జల మండలి, హైడ్రా శాఖల నడుమ సమన్వయం లేకపోవడంతో చెరువు పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సుమారు 500లకు పైగా పైకాలనీల నుంచి వచ్చే వరద నీరు చెరువులోకి సాఫీగా వెళ్లడం లేదన్నారు. అసంపూర్తిగా ఉన్న బాక్స్ టైప్ నాలా పనులు, ఎఫ్‌టీఎల్ స్థలంపై కోర్టు వివాదాలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప్రజా సమస్యలను ప్రాధాన్యతంగా తీసుకోని పరిష్కరించాలని కోరారు.

ఏసు బోధనలపై ప్రదర్శన

మలక్‌పేట: చిన్ననాటి నుంచే పిల్లలను ఆధ్యాత్మిక మార్గంలో నడిపించాలని మలక్‌పేట హోరేబు చర్చి పాస్టర్ బ్రదర్ గడ్డం మోజెస్ అన్నారు. ఏసుక్రీస్తు జననం, బోధనలు, మహాత్కార్యాలపై ఆదివారం సండే స్కూల్లో ఏర్పాటు చేసిన ప్రదర్శన ప్రారంభించి మాట్లాడారు. పిల్లలు మంచి మార్గంలో నడిచేలా చొరవ చూపాలన్నారు. యేసు బాల్యం, అద్భుత కార్యాలు, దేవుడు మోషేకు ఇచ్చిన పది ఆజ్ఞలు, ప్రత్యక్ష గుడారం, బాబేలు గోపురం, హోరేబు చర్చి నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.


మహేశ్వరం: జామ మసీదులో ప్రత్యేక పూజలు చేస్తున్న ముస్లింలు


తుక్కుగూడ: మంఖాల్‌లో..

ఘనంగా గ్యార్మీ పండుగ

మహేశ్వరం: మండల కేంద్రంలోని జామ మసీద్, దర్గాలోని హజరత్ సయ్యదినా మహబూబ్ సుభానీ రహమతుల్లా అలై చిల్లా ముబారక్ గ్యార్మీ పండుగను ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఘనంగా నిర్వహించారు. ప్రజలందరినీ ఆయు ఆరోగ్యాలతో చల్లగా చూడాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కుల, మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ గ్యార్మీ పండుగలో పాల్గొని మత సామరస్యాన్ని పెంపొందే విధంగా నిర్వహిస్తామన్నారు. అనంతరం మజీద్ వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. జామ మసీద్ ఇమామ్, సయ్యద్ అహ్మద్ అలీ, ముస్లిం మతపెద్దలు ఎంఏ.సమీర్, సయ్యద్ అరీఫ్ అలీ, మహ్మద్ అక్బర్ పాషా, మహ్మద్ ముస్తాక్, మహ్మద్ మోసిన్, షేక్ హాజీ బాబ, మహ్మద్ సర్దార్ పాల్గొన్నారు.

మంఖాల్‌లో..

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్‌లో ముస్లింలు ఆదివారం గ్యార్మీమి షరీఫ్ ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మజీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికరూ ఆలింగనం చేసుకొని పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. చాంద్ సాహెబ్, సయ్యద్ సాబేర్ అలీ, ఇమూమ్, అబ్దుల్, జావిద్ పాల్గొన్నారు.

ఎస్‌ఎన్‌డీపీ నాలాలోని వ్యర్థాలను తొలగించాలి

అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం


మురుగునీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: లింగోజిగూడ డివిజన్ గ్రీన్‌పార్క్ కాలనీ సమీపంలోని ఎస్‌ఎన్‌డీపీ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. ఆదివారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీలో 15 రోజుల నుంచి ఎస్‌ఎన్‌డీపీ నాలా మురుగునీరు క్యాచ్ పిట్స్ ద్వారా పొంగి పలు ఇళ్లలోకి వస్తున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి గ్రీన్‌పార్క్‌లో పర్యటించి మాట్లాడారు. అవసరమైతే నాలా స్లాబ్ బ్రేక్ చేసి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. సరూర్‌నగర్ చెరువు ముఖద్వారం వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను ను తొలగించాలన్నారు. ఎస్ఎన్‌డీపీ నాలా శివగంగా థియేటర్ వద్ద గల ఔట్‌లేట్ సమస్యను జోనల్ కమిషనర్‌తో మాట్లాడి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వరప్రసాద్ రెడ్డి, తిలక్‌రావు, జగన్నాథ్ రెడ్డి, మధుసాగర్, ప్రకాష్, ఇంద్రజీ, అనిల్, ప్రసాద్, శ్రీకాంత్, అరుణ్, యశ్వంత్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జగన్ రెడ్డి, కార్యదర్శి మహిపాల్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు రాఘవేందర్ రెడ్డి, సురేష్, శేఖర్, నారాయణ రెడ్డి, వెంకట్ రెడ్డి, రామయ్య, సువర్ణ, యాదాలక్ష్మి ఉన్నారు.

ఆర్జిత సేవల యూపీఐ చెల్లింపులు ప్రారంభం


నగదు రహిత చెల్లింపుల కౌంటర్ ప్రారంభిస్తున్న ఈఓ లావణ్య

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయంలో భక్తులు చేయించే అభిషేకాలు, అర్చనలు వంటి ఆర్జిత ప్రత్యేక పూజలు, ప్రసాదాలు కొనుగోలుకు నగదు రహిత యూపీఐ చెల్లింపుల ప్రత్యేక కౌంటర్లను ఆదివారం ఈఓ లావణ్య పాలకమండలి చైర్మన్ సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ...రోజురోజుకు స్వామివారిని దర్శించుకునేందుకు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్జిత సేవల టికెట్ కౌంటర్ల స్థానంలో యూపీఐ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఆలయానికి హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పాలకమండలి సభ్యులు, దాతలు, భక్తుల సహకారాలతో ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు నాగరాజు, తోకటి కారణ్‌కుమార్, ప్రవీణ్‌గౌడ్, శ్రీనివాస్, విష్ణువర్ధన్ రెడ్డి, దుర్గారెడ్డి, గోపాల్‌రెడ్డి, నరేష్, సంతోష్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టపగలు వెలుగులు

- నిరంతరం వెలుగుతున్న వీధి దీపాలు
- పట్టించుకోని విద్యుత్ సిబ్బంది

మొయినాబాద్‌రూరల్: విద్యుత్‌ను పొదుపుగా వాడాలని ఓ వైపు ప్రభుత్వం చెబుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో వృథా అవుతూనే ఉంది. రాత్రి సమయాల్లో గ్రామాల్లో వెలుతురు కోసం ఏర్పాటు చేసిన వీధిదీపాలు పగలు సైతం వెలుగుతున్నాయి. వాటికి కొన్ని గ్రామాల్లో ఆన్, ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో, మరికొన్ని ప్రాంతాల్లో స్విచ్‌లు ఉన్నా ఆఫ్ చేయకపోవడంతో కరెంట్ ఉన్నంతసేపు విద్యుత్ దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. మండల పరిధిలోని బాకారం, శ్రీరాంనగర్, మేడిపల్లి, చందానగర్, టోల్‌కట్ట, చిన్నమంగళారం తదితర గ్రామాల్లో వీధి దీపాలు పగలు, రాత్రీ అనే తేడా లేకుండా ఎప్పుడు వెలుగుతున్నాయి. వీధి దీపాల నిర్వహణను విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలకు ఆన్, ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



బాకారం గ్రామ పంచాయతీపై వెలుగుతున్న వీధిదీపం


బాకారం ఎస్సీ కాలనీలో ..

ప్రజావీరుడు పండుగ సాయన్న


విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

చేవెళ్ల: బహుజనుల హక్కులు, సామాజిక న్యాయం కోసం పండుగ సాయన్న చేసిన కృషి మరువలేనిదని మండల ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. చేవెళ్లలో ఆదివారం ఆయన విగ్రహ ఆవిష్కరణ చేసి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఊరడి నర్సింలు, యువజన అధ్యక్షుడు తెలుగు శ్రీనివాస్, నాయకులు శివరాజ్, రాంప్రసాద్, వెంకటేశ్, గోపాల్, గణేశ్, బాలయ్య, శ్రీనివాస్, భిక్షపతి, అంజయ్య, జనార్ధన్, నర్సింలు ఉన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు


మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ కలిసి సమన్వయంగా పనిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం మొయినాబాద్ మండలానికి చెందిన నాయకులు, చేవెళ్ల నియోజకవర్గ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ అభ్యర్థులను గెలిపించుకోవాలని తెలిపారన్నారు.

శిశుమందిర్‌లో 'అలయ్ బలయ్'

శంకర్‌పల్లి: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో 'అలయ్ బలయ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలు రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు వ్యక్తులను మరింత దగ్గర చేసేందుకు ఉపయోగపడుతాయని, ప్రతి సంవత్సరం ఈ తరహా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

న్యూమధురాపురి కాలనీ అధ్యక్షుడి నియామకం


నూతన కమిటీని సన్మానిస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 4వ డివిజన్ న్యూ మధురాపురి కాలనీ సంక్షేమ సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సంక్షేమ సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెరుమళ్ల నవీన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా గౌరవ అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా అశోక్, ప్రధాన కార్యదర్శిగా రేవంత్, కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా బల్వంత్ ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. అందరి సహకారంతో కాలనీలో పేరుకుపోయిన సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని అన్నారు. నియామకానికి పూర్తి సహకారం అందించిన కాలనీవాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ మాజీ అధ్యక్షుడు తాడూరి వెంకటరమణ, కాలనీవాసులు మహేందర్‌రెడ్డి, శంకర్‌నాయక్, నాగార్జున, ప్రసాద్, బసవరాజు, కిరణ్, మహిళలు ఉన్నారు.

తాగునీటి కష్టాలు తీర్చిన ఘనత కేసీఆర్‌దే

ఎమ్మెల్యే సబితారెడ్డి


తాగునీటి పైపులైన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: మిషన్ భగీరథ పథకంతో ఇంటింటికీ తాగునీరు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని హయత్ కౌంటి కాలనీలో వేసిన నూతన తాగునీటి పైపులైన్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని ఏర్పాటు తర్వాత మిషన్ భగీరథ పథకాన్ని తీసుకొచ్చి గ్రామాలు, పట్టణాల్లో ట్యాంకులు నిర్మించి ఇంటింటికీ మంచినీరు అందించిన ఘనత బీఆర్ఎస్‌దేనన్నారు. కాలనీతో పాటు పక్కన ఉన్న షరీఫ్‌నగర్, డ్రీమ్ సిటీ కాలనీల్లో కూడా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని జలమండలి అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, కాలనీ అధ్యక్షుడు మహ్మద్ అక్బిల్, రవూఫ్, మహ్మద్ బాసిత్, అబ్దుల్ బాయ్, టేకుల భాస్కర్‌రెడ్డి, మహిళలు ఉన్నారు.

ముస్తాబవుతున్న 'ఐలవ్ నాగోలు'



నాగోలు: నాగోలు చౌరస్తా సుందీరకణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. నాగోలు చౌరస్తాలోని గాంధీ విగ్రహం ఎదురుగా 'ఐలవ్ నాగోలు' అక్షర మాలకు లైటింగ్‌ను ఇప్పటికే సమకూర్చుతున్నారు. దీని ఇరువైపులా ఆకట్టుకునే విగ్రహాలు, శిల్పాలు ఏర్పాటు చేయనున్నారు. దీపావళి వరకు విద్యుత్ వెలుగులతో నాగోలు చౌరస్తా కొత్త శోభ సంతరించుకోనుంది. ఇప్పటికే నాగోలు చౌరస్తా ఫ్లైఓవర్ దగ్గర ఏర్పాటు చేసిన పచ్చని మొక్కలు సోయగం.. సుందరీకరణలో చేపట్టిన పనులు ఆకట్టుకున్నాయి. గతంలో చిన్న గ్రామం ఉండే నాగోలు ప్రాంతం దిన దిన అభివృద్ధి చెందుతోంది. నాగోలు చౌరస్తాలో గతంలో ట్రాఫిక్ సమస్యలో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గతంలో ఇక్కడ నిర్మాణం చేసిన ఫ్లైఓవర్‌తో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం అయింది. దీంతో ఫ్లైఓవర్ మధ్యలో ఉన్న ఉన్న గాంధీ విగ్రహం దగ్గర రోజు చెత్త చెదారం చెరడంతో స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ విషయం జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు చౌరస్తాను పరిశీలించి అక్కడ నాగోలు గుర్తుగా ఐ లవ్ నాగోలు అక్షరమాలకు ఏర్పాటు చేశారు. దీపావళి నాటికి దీన్ని ప్రారంభించే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి


నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలు

హస్తినాపురం: బస్సు చార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని బీజేపీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ హస్తినాపురం అధ్యక్షుడు ఎరుకుల మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో టీకేఆర్ కాలేజీ నుంచి నందనవం లక్కీ హోటల్ వరకు ఆదివారం నల్లబాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్సు చార్జీల పెంపుతో కాంగ్రెస్ ప్రభుత్వం మరో మోసాని పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి స్టేజీకి రూ.10 పెంచి నగర ప్రయాణికులపై పెనుభారం మోపుతుందన్నారు. అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయ్యిందని ప్రజలకు ఇచ్చిన హామీలను నెర వేర్చే వరకు బీజేపీ పోరాటాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజుగౌడ్, కిరణ్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, శేఖర్‌గౌడ్, జీవన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రకాంత్, వెంకటాచారి, గణేష్, బాలరాజు, శశిధర్‌రెడ్డి, రాజేందర్, విజయ్‌కుమార్, విజయశ్రీ, అంజి, అరవింద్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంక్

- ఆందోళనలో స్థానికులు
- కూల్చివేసి, నూతనంగా నిర్మించాలని వినతి


శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు

మొయినాబాద్: నలభై ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలి పడుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారంలో వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ట్యాంక్ పిల్లర్లు, బీమ్‌ల పెచ్చులూడి పోయి ఇనుప రాడ్లు తేలాయి. అయినా ఇప్పటికీ దానిలో నీటిని నింపుతుండడంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ట్యాంకులో నుంచి నీళ్లు లీకవుతున్నాయి. ఇళ్ల సమీపంలో ప్రమాదకరంగా ఉన్న వాటర్‌ట్యాంకుకు మరమ్మతులు చేయించాలని.. లేదంటే పూర్తిగా తొలగించి కొత్తది నిర్మించాలని అనేక సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించామని.. ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న వాటర్ ట్యాంకును తొలగించాలని కోరుతున్నారు.

జాతీయ భావం పెంపునకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి


స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: జాతీయ భావాలు పెంపొందించడానికి ఆర్ఎస్ఎస్ కృషి చేస్తుందని నగర కార్యవాహ సుధాకర్ అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మలక్‌పేట నగర్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సలీంనగర్‌లో నిర్వహించిన పదసంచలన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దేశ పరమ వైభవాభివృద్ధికి పాటు పడుతుందన్నారు. బాలదానమ్మ బస్తీ కమ్యూనిటీహాల్ నుంచి ప్రారంభమైన పదసంచలన్ జామ్ జామ్‌మిల్క్ సెంటర్, సిరిపురం కాలనీ, సలీంనగర్-1,2, గణేష్ టెంపుల్, స్వామి వివేకానంద స్కూల్ చౌరస్తా మీదుగా బాలదానమ్మ బస్తీ వరకు కొనసాగింది. మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రాంత సహా కార్యవాహ మల్లికార్జున్, మోహన్, సభ్యులు పాల్గొన్నారు.



దుమ్ముతో ఊపిరాడక

ఉక్కిరిబిక్కిరి

వాహనదారుల ఇబ్బంది

ఎల్‌బీనగర్: ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులపై భారీగా బురద పేరుకుపోయింది. వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టడంతో బురద ఎండిపోయి దుమ్ముగా మారి రాకపోకలు సాగించే క్రమంలో నోరు, కళ్లలోకి వెళ్లి ఇబ్బందులకు గురి చేస్తోందని పలువురు వాహనదారులు వాపోతున్నారు.ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారులపై పేరుకపోయిన మట్టి రేణువులు గాలిలోకి లేచి ద్విచక్ర వాహనదారులు పాదచారులను ఇబ్బంది పెడుతున్నాయి. కంటి సమస్యలు తలెత్తడంతో ఆస్పత్రుల బాట పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులపై వరదలు పారి మట్టి పేరుకుపోయింది. రోజు వారీగా పారిశుద్ధ్య కార్మికులు చెత్తను తొలగించకపోవడంతో వేగంగా వచ్చే వాహనాల కారణంగా దూళి దుమ్ము లేచి వాహనదారుల కళ్లలో పడుతుంది. ఎగిసిపడుతున్న దుమ్ముతో ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని పలువురు వాహనదారులు వాపోతున్నారు.